7

సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



వెచ్చని నేస్తాలు

చలి కాలం ప్రారంభం అయింది. మదనపల్లెలో చలి తీవ్రత ఎక్కువ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉన్ని దుస్తుల విక్రయాలు ఊపందుకున్నాయి. -8లో



బాలల చేతిలోనే దేశ భవితవ్యం

నేటి తరం పిల్లలే రేపటి తరానికి పునాదులని వారి మీదే దేశ భవితవ్యం ఆధారపడి ఉందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. రమాదేవి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.240
రెండోరకం	రూ.110	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 233 మెట్రిక్ టన్నులు





పెద్ద దర్గా ఉరుసుకు వేళాయె

రేపటి నుంచి పెద్ద దర్గా ప్రధాన ఉరుసు

- వారం రోజులపాటు నగరం కళకళ
- పూర్తయిన ఏర్పాట్లు

కడప కల్చరల్: ఆధ్యాత్మిక చింతనకు...మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న కడప పెద్ద దర్గా (అమీన్ పీర్ దర్గా) ఉరుసుకు వేళయింది. ప్రశాంతతకు నిలయంగా జాతీయ స్థాయిలో ఖ్యాతి గాంచిన ఈ దర్గా గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. శనివారం నుంచి ఈ నెల 21వరకు జరిగే ప్రధాన ఉరుసు ఉత్సవాలకు దర్గా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే విద్యుద్దీప శోభతో ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉత్సవ కాంతులను వెదజల్లుతోంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతోంది.

విలక్షణ సూఫీ ఆధ్యాత్మిక కేంద్రం

ఈ దర్గాకు సంబంధించిన ప్రథమ సూఫీ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మహమ్మద్ చిష్తి వుల్‌ఖాద్రి కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి 16వ శతాబ్దంలో ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చారు. సూఫీ తత్వాలతో ప్రజల్లో దైవ చింతనను పెంచిన ఈయనకు నాటి కడప నవాబులు ప్రియ శిష్యులుగా ఉండేవారు. ఆయన వారసునిగా ప్రస్తుతం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ 11వ పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. దర్గాపై అపార విశ్వాసం గల భక్తులు మన దేశంతోపాటు పాకిస్తాన్, గల్ఫ్ దేశాలలో కూడా ఉన్నారు.

సామాజిక సేవలు

కేవలం ఆధ్యాత్మిక చింతనతోపాటు దర్గా ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. పేద యువతులకు కుట్టు, అల్లికల్లో శిక్షణ, యువకులకు ఐటీఐ ద్వారా వృత్తి విద్య అందిస్తున్నారు. దర్గాకు సమీపంలో నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఆధునిక విద్య నేర్పే పాఠశాలలను నెలకొల్పి విద్యాదానం చేస్తున్నారు.

- అన్ని మతాలకు చెందిన వారు దర్గాను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో దర్గా పరిసరాల్లో ఉన్న ఇతర మతాలకు చెందిన ప్రార్థనాలయాలను కూడా ఉరుసు సందర్భంగా మరమ్మతులు చేసి నూతనంగా తీర్చిదిద్దడం విశేషం.



▸▸ మహిమాన్విత క్షేత్రం



దర్గాలోని గురువుల మజార్లు

కడప నగరంలోని అమీన్‌పీర్ (పెద్ద) దర్గాకు జాతీయ స్థాయిలో విశిష్టమైన ఖ్యాతి ఉంది. 63 ఏళ్లపాటు కఠోరమైన తపస్సు చేసిన గురువు ఇక్కడ జీవసమాధి కావడంతో మహిమాన్విత క్షేత్రంగా పేరుగాంచింది. ఈ దర్గాలో ప్రార్థనలు చేసి తమ సమస్యలు పోవాలని కోరుకుంటే తప్పక మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఏటా జరిగే ఉరుసు ఉత్సవాలలో ముస్లిమేతరులు కూడా విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ దర్గా మతసామరస్యానికి, జాతీయ సమైక్యతకు మారుపేరుగా నిలుస్తోంది.

న్యూస్‌రీల్

19న జాబ్‌మేళా

రాయచోటి (జగదాంబసెంటర్): ఈ నెల 19వ తేదీన పీలేరు, తంబళ్లపల్లెలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ సీడాప్ అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో ప్రముఖ కంపెనీలతో ఉద్యోగమేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేయుటకు అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి 18 నుండి 30 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. కాగా నెలకు రూ.10 వేల నుండి రూ.20 వేల వరకు హోదాను బట్టి జీతం ఉంటుందన్నారు. పీలేరులోని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అలాగే తంబళ్లపల్లెలోని టీఎన్‌వీఎస్ఆర్ఎం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నామన్నారు.

అర్చకులు సరైన ఖాతాలను అందజేయాలి

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లాలోని అర్చకులు సరైన సేవింగ్ ఖాతా అకౌంటర్ నంబర్లను అందజేయాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధూప దీప నైవేద్యం పథకం ద్వారా వేతనాలు పొందుతున్న అర్చకులకు చాలా వరకు సకాలంలో వేతనాలు జమకాలేదన్నారు. ఇందుకు కారణం సరైన ఖాతాలను ఇవ్వలేదన్నారు. ఇందుకోసం ఈ నెల 19వ తేదీన అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంబంధిత అర్చకులు ఖచ్చితమైన అకౌంట్స్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సమర్పించాలని ఆయన కోరారు.

రేపు 'యువ ఉత్సవ్'

వైవీయూ: భారత ప్రభుత్వం యువజన సర్వీసులశాఖ మార్గదర్శనంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 16న యోగివేమన విశ్వవిద్యాలయంలో 'యువ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు గల యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 'ఇండియా–2047' అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాలలో వక్తృత్వ పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ మేళా సింగిల్ గ్రూప్ ఫొటోలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 80088 19556 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్: కడప డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ తుదిదశకు చేరుకుంది. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన ఎంపికల ప్రక్రియ 5వ రోజు గురువారం కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన అభ్యర్థులకు తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం పరుగు పందెం, పుల్లప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, లాంగ్‌జంప్, హైజంప్ నిర్వహించారు.

ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

వైవీయూ: వైవీయూ డిగ్రీ, ఎల్.ఎల్.బి సెమిస్టర్‌ల పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. కృష్ణారావు, సహాయ నియంత్రణ అధికారి డాక్టర్ కె. శ్రీనివాసరావుతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన చాంబర్లో ఫలితాల విడుదల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.ఎల్.బి (ఫైవ్ ఇయర్స్) రెండో సెమిస్టర్‌లో 113 మంది హాజరు కాగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. 59.29 శాతం నమోదయింది. నాలుగో సెమిస్టర్ లో 87 మంది హాజరు కాగా 9 మంది , ఆరో సెమిస్టర్ లో 79 మంది హాజరు కాగా 59 మంది, ఎనిమిదో సెమిస్టర్ లో 73 మంది పరీక్షకు హాజరు కాగా 53 మంది, పదో సెమిస్టర్ లో122 మంది పరీక్ష రాయగా 108 మంది పాసయ్యారని వెల్లడించారు.

● కరువు ప్రాంతం నిరాదరణ..

కుప్పం కోసమే విస్తరణ!

- రూ.473 కోట్ల పీబీసీ లైనింగ్ పని నామినేషన్‌పై అప్పగింత
- వైడనింగ్ సంస్థకే పనులు
- రూ.204 కోట్లతో కేజీసీ లైనింగ్‌కి త్వరలో టెండర్లు

బి.కొత్తకోట: రాజు తలచుకుంటే ఏమైనా చేయొచ్చు.. అలాంటిది తను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించుకోవడం పెద్ద కష్టమేమీకాదు. అయితే నీళ్లు మొదట ప్రవహించే ప్రాంతానికి ద్రోహం చేసి తన ప్రాంతానికి నీళ్లు పుష్కలంగా ప్రవహించేలా చేసుకుంటే..అది ప్రాంతాల మధ్య అసమతుల్యం పాటించినట్టే. హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) విస్తరణ పని విషయంలో అదే జరుగుతోంది.

- శ్రీ సత్యసాయి జిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు పుంగనూరు ఉపకాలువ ద్వారా సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంకు వెళ్లాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ కాలువను రూ.1,217 కోట్లతో విస్తరణ పనులు చేపట్టగా అవసరం లేదని నిలిపివేయించిన ప్రభుత్వం ఇప్పుడు కుప్పం కోసం ప్రత్యేకంగా 18 కిలోమీటర్ల మేర విస్తరణకు సిద్ధమైంది. దీనికి రూ.204 కోట్ల పనులకు టెండర్ల కోసం అధికారులు చర్యలు చేపట్టారు.

ఆ 18 కిలోమీటర్లు మాత్రమే ..

జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు వద్ద కిలోమీటర్ 79 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం తిమ్మిరెడ్డిగారిపల్లె వద్ద 220.350 కిలోమీటర్ వరకు పీబీసీ సాగుతుంది. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కాలువ ప్రవాహ సామర్థ్యం మేరకు కుప్పం వరకు కృష్ణా జలాలు ప్రవహిస్తాయి. అయితే కుప్పం నియోజకవర్గానికి నీటిని సులువుగా, అధికస్థాయిలో నీటిని తరలించుకోవడం కోసం పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల మధ్య పీబీసీ, కుప్పం ఉపకాలువ వెడల్పునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పుంగనూరు మండలంలో కిలోమీటర్ 189.80 నుంచి కుప్పం ఉపకాలువ మొదలయ్యే పెద్దపంజాణీ మండలం అప్పినపల్లె వద్ద కిలోమీటర్ 207.800 వరకు 18 కిలోమీటర్ల కాలువను వెడల్పు చేయనున్నారు. ప్రస్తుత కాలువ ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు. దీనికి అదనంగా మరో 137 క్యూసెక్కుల ప్రవాహం పెంచుతారు. అంటే ఎగువ ప్రాంతాలైన తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నుంచి వచ్చే నీటిని అతివేగంగా కుప్పానికి తరలించుకునే ప్రయత్నంగా చెప్పవచ్చు. మిగతా నియోజకవర్గాలకు విస్తరణ పనులు నిలిపివేసి కుప్పం కోసమే విస్తరణ పనులు చేపట్టడం కరువు ప్రాంతాలకు ద్రోహం చేసినట్టే.



బి.కొత్తకోట వద్ద పీబీసీలో జంగిల్ క్లియరెన్స్ పనులు

▸▸ రూ.473 కోట్లతో లైనింగ్ పనికి నామినేషన్

హంద్రీ–నీవా రెండో దశ ప్రాజెక్టు తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో సాగే ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ పని విషయంలో ప్రభుత్వం నామినేషన్ పద్ధతి అవలంబించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీబీసీ విస్తరణ కోసం రూ.1,217 కోట్లతో పనులు చేపట్టగా కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే ఇదే కాలువకు సిమెంటు లైనింగ్ పనులకు నిర్ణయించగా అధికారులు రూ.473 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

- కిలోమీటర్ 79.600 నుంచి 220.350 వరకు లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్ల జోలికి వెళ్లలేదు. పీబీసీ విస్తరణ పనులు చేపట్టిన హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థకే అప్పగించింది. ఈ సంస్థ ఇప్పటికే మదనపల్లె చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పనులు చేసినందుకు రూ.117 కోట్ల బిల్లులు చెల్లించాల్సివుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ సంస్థకే లైనింగ్ పనులు అప్పగించగా కాలువలోని జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి.

బాబు పాలన అంతా మోసమే

- అసెంబ్లీలో ఆత్మస్తుతి, పరనింద తప్ప మరొకటి లేదు
- మోసం చేయడమే లక్ష్యంగా పాలన
- సంపద సృష్టికర్త కాదు.. మోసాల సృష్టికర్త
- చంద్రబాబు సీఎం కావడంతో అన్ని పథకాలు క్లోజ్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి



తన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి

రాజంపేట: ప్రజలకు మోసం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన చేస్తున్నారని, సంపద సృష్టికర్తగా కాకుండా మోసాల సృష్టికర్తగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి విమర్శించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో అబద్ధాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. అసెంబ్లీలో ఆత్మస్తుతి, పరనిందే తప్ప మరొకటి లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ఒక మోసం అని ప్రజలు ఇప్పటికే గుర్తించారన్నారు. వీటన్నింటినీ ప్రశ్నించినందుకు ఇండియాలో ఎక్కడాలేని విధంగా ఏకంగా 680 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులకు నోటీసులు ఇచ్చారని, 147 మందిపై కేసులు పెట్టారని, 49 మందిని అరెస్టు చేశారని.. ఇది అత్యంత దారుణమన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించి అరెస్టులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం మహిళాలోకానికి అండగా నిలవలేకపోయిందని దుయ్యబట్టారు. చంద్రబాబు తన బడ్జెట్‌లో కూడా మహిళలను అంకెలగారడీతో మోసం చేశారన్నారు. ప్రతి సెక్షన్‌ను మోసం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని రకాలుగా రాష్ట్రం కుదేలైపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకోకుండా ప్రజల్ని మోసం చేస్తున్న పరిస్థితి నేడు ప్రజలు కళ్లారా చూస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే అన్ని పథకాలు క్లోజ్ అయ్యాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన పాలనలో అన్ని వర్గాలకు తన బాదుడే బాదుడు ప్రజలకు రుచిచూపించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చంద్రబాబు తన దుష్ప్రచారం మానలేదన్నారు. బడ్జెట్‌లో పథకాలకు కేటాయింపులు సరిపడగా లేవన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన కొనసాగిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచారని ఆకేపాటి గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికల మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రుని జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం: వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలను బ్రహ్మంగారిమఠంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఎండోమెంట్ ఈఓ , మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో గురువారం మఠం ఆస్థానం పండితులు జనార్దనాచార్యులు పర్యవేక్షణలో హోమాలు, కళ్యాణం నిర్వహించారు. ఇందులో పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, రెండవ కుమారుడు భద్రయ్యస్వామి, మూడవ కుమారుడు వీరబొట్లయ్య స్వామి, నాల్గువ కుమారుడు దత్తయ్యస్వామి దంపతులు పాల్గొన్నారు.



మఠం ఆవరణలో ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు దంపతులు

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

నిమ్మనపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం నిమ్మనపల్లె మహిళా సమాఖ్య కార్యాలయంలో సీఎంఓ పీజీఆర్ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, పక్కాగృహ నిర్మాణ ప్రగతి, ఎస్‌సీపీఐ బ్యాంకు అకౌంట్లకు ఆధార్ లింక్ తదితర అంశాలపై మదనపల్లె ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర, మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఓ పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో అందిన ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలన్నారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి, నిష్పక్షపాతంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇసుక డంప్ చేసినా, యంత్రాలు ఉపయోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ముష్టూరు గ్రామంలో ఓ రైతు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకోగా, సదరు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ శ్రీనివాసులు, తహసీల్దార్ ధనుంజయులు, ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి, ఏపీఎం మురళి, ఏపీఓ రమేష్, ఏఓ రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లె: క్షేత్రస్థాయిలో పీజీఆర్ఎస్ దరఖాస్తుకు సంబంధించిన భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

సదుపాయాలు తప్పనిసరి

కలికిరి (వాల్మీకిపురం): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలుండాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. వాల్మీకిపురం–4 అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని సమస్యలు, ఆహార నాణ్యతపై విచారించారు. మండల పరిధిలోని జర్రావారిపల్లి పంచాయతీలో రూ.5లక్షల అంచనా వ్యయం, చింతలవారిపల్లిలో రూ.4లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను కలెక్టరు తనిఖీ చేశారు. కార్యక్రమాలలో మదనపల్లి ఆర్డీఓ రాఘవేంద్ర, డ్వామా పీడీ వెంకటరత్నం, జిల్లా సర్వే అధికారి భరత్ కుమార్, తహశీల్దార్ పామిలేటి పాల్గొన్నారు.

▸▸ పల్లె పండుగ పనులలో పురోగతి సాధించాలి

రాయచోటి: పల్లెపండుగ పనులలో పురోగతి సాధించాలని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలను, అధికారులను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఈఓలు తదితరులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు, పల్లె పండుగ, విద్యార్థులకు అపార్ ఐడీల నమోదు, సర్వేరాళ్లపై బొమ్మల తొలగింపు తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భయపెట్టడమే వ్యూహం

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియానే టార్గెట్
- అధినేతల నుంచి కిందిస్థాయి నేతలకు సమాచారం రాగానే ఫిర్యాదు
- కీలక నేతలను పోలీసుల ద్వారా ఇబ్బంది పెట్టడమే పథక రచన
- ఇప్పటికే అరవీడుకు చెందిన హనుమంతరెడ్డి బెయిలుపై విడుదల
- రాజంపేటలో సినీ నటుడు పోసానిపై ఫిర్యాదు
- వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టడమే లక్ష్యంగా అడుగులు
- నేతలు, కార్యకర్తలకు అండగా వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్



సాక్షి రాయచోటి: ఎన్నికల అనంతరం కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినా సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలకు తెర తీస్తోంది. అన్ని వర్గాలకు పథకాలను అందించి సంక్షేమం ద్వారా ప్రత్యేక ముద్ర వేసుకోవడం ఒక కోణమైతే....హామీలు అమలు చేయని సందర్భంలో ప్రజలు తిరగబడకుండా భయాందోళనలకు గురి చేయడం మరో ఎత్తు. ఈ రెండవ కోవను ఎంచుకున్న అధికార పార్టీ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాతోపాటు శ్రేణులను భయపెట్టే వ్యూహానికి పదును పెట్టింది. అధిష్టానం పెద్దల నుంచి సలహాలు, సూచనలతోపాటు సమాచారం రాగానే నేరుగా కిందిస్థాయి కూటమి శ్రేణులు ఫిర్యాదు చేయడం...ఆగమేఘాల మీద పోలీసులు కేసులకు ఉపక్రమిస్తున్నారు. ఎలాగైనా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయపెట్టి పార్టీ కార్యక్రమాలకు దూరం చేయడమే లక్ష్యంగా అధికార పార్టీ అడుగులు పడుతున్నాయి.

ఫిర్యాదు చేయడం...కేసు నమోదు చేయడం..

కూటమి సర్కార్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడచూసినా హత్యలు, అరాచకాలు, అఘాయిత్యాలు, ఘోరాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రశ్నించే గొంతుకలపై కూడా సర్కార్ కత్తి పెడుతోంది. ఎక్కడికక్కడ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో కిందిస్థాయి నాయకులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆరు కేసులు నమోదు చేశారు. అందులో గాలివీడు మండలం అరవీడుకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు హనుమంతరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రెండు రోజుల విచారణ పేరుతో ముప్పుతిప్పలు పెట్టారు. అనంతరం కోర్టులో హాజరుపెట్టి బెయిలుపై విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వింగ్‌తోపాటు చురుకైన కార్యకర్తలను కూడా టార్గెట్ చేసి వేధింపుల పర్వం కొనసాగిస్తున్నారు. ప్రధానంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఫిర్యాదు చేయడం, వెంటనే కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారిపోయింది.

సినీ నటుడు పోసానిపై ఫిర్యాదు

జిల్లాలో కూటమి నేతల ఫిర్యాదుతో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, సోషల్ మీడియా ప్రతినిధులపై కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే పులివెందులలో సజ్జల భార్గవ్‌తోపాటు వర్రా రవీంద్రారెడ్డిమీద కేసులు నమోదు చేశారు. అలాగే రాజంపేట, నందలూరులోనూ వర్రా రవీంద్రారెడ్డిపై పోలీసులు కేసులు పెట్టారు. తాజాగా రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో టీడీపీ నేతలు సినీ నటులు పోసాని కృష్ణమురళిపై కూడా ఫిర్యాదు చేశారు. ఇలా నేతలు ఫిర్యాదు చేయడం, అలా కేసులు నమోదు కావడం...ఆగమేఘాల మీద నోటీసులు ఇచ్చి పోలీసులు అరెస్టు పర్వానికి తెర తీస్తున్నారు.

పార్టీ శ్రేణులకు అండగా వైఎస్ జగన్

అసభ్యత, అశ్లీలతకు తావు లేకుండా...ప్రభుత్వం చేసే తప్పులు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయని సీఎం చంద్రబాబు నైజంపై సోషల్ మీడియాలో ప్రచారం చేయండి...అండగా నేనున్నానంటూ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వేదికలుగా గొంతు విప్పి ప్రశ్నించండి...అందరికీ అండగా ఉంటానంటూ వైఎస్ జగన్ భరోసా ఇస్తున్నారు. కార్యకర్తలతోపాటు నేతలను ఎప్పటికప్పుడు ఇన్‌ఛార్జిల ద్వారా సంబంధిత బాధితుల గురించి అడుగుతూ ధైర్యాన్ని నింపుతున్నారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. చంద్రాకాలనీకి చెందిన రామచంద్ర (60) బైపాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రామచంద్ర గాయపడగా, గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి

కేవీపల్లె : పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాపురం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఉప్పుతోలు మోహన్ తన పాడి ఆవులను ఓ చెట్టుకింద కట్టి ఉంచాడు. గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీంతోపాటు పిడుగుపడటంతో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. రూ. 1.20 లక్షలు విలువ చేసే పాడి ఆవులు మృతి చెందాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మె

సిద్దవటం : తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సిద్దవటం 108 ఉద్యోగులు తెలిపారు. సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవీలతకు, ఎంపీడీఓ ఫణిరాజకుమారికి గురువారం వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 108 ని ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. 12 గంటల పని విధానాన్ని రద్దుచేసి 8 గంటల విధానాన్ని అమలు చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వెంకటరమణ

రామాపురం : అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా చిట్లూరు దళితవాడకు చెందిన జి.వెంకటరమణను నియమించారు. గురువారం విజయవాడలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన బాను, సారా

ఓబులవారిపల్లె : టెన్నిస్ బాల్ క్రికెట్‌లో జాతీయ స్థాయి పోటీలకు చిన్నఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థినులు బాను, సారా ఆల్ ఇండియా నేషనల్ టెన్నిస్ వరల్డ్ క్రికెట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. నవంబర్ 18 నుంచి జమ్ము కాశ్మీర్‌లోని జమ్ముతావిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు ఆడనున్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వెచ్చని నేస్తాలు..!

- ప్రారంభమైన టిబెటన్ల ఉన్ని దుస్తుల వ్యాపారం
- మదనపల్లెలో వంద రోజుల పాటు విక్రయాలు
- ఉన్ని వస్త్రాలతో చలికి చెక్ పెడుతున్న ప్రజలు





టిబెటన్ల స్వెటర్ల దుకాణాలు

మదనపల్లె సిటీ : చలి పులి జిల్లా వాసులను వణికిస్తోంది. సాయంత్రం 6 గంటలకే చలి గాలులు వీస్తున్నాయి. శీతాకాలం రానే వచ్చింది. వస్తూ.. వస్తూ మదనపల్లెకు వెచ్చని నేస్తాలను తీసుకొచ్చింది. చలిని పారదోలేందుకు ఉన్ని దుస్తులతో టిబెటన్లు ఇక్కడికి వచ్చి వాలిపోయారు. దాదాపు వంద రోజుల పాటు ఇక్కడే ఉండి, ఇక్కడి ప్రజలతో మమేకమై తమ వ్యాపారాన్ని సజావుగా చేసుకుని వెళ్లిపోతారు. దేశం కాని దేశం.. భాష తెలియదు. అయినప్పటికీ ఇక్కడి ప్రజలు అందిస్తున్న సహకారంతో 45 ఏళ్లుగా శీతాకాలంలో ఇక్కడికి వచ్చి వ్యాపారం చేసుకుంటున్నామంటున్నారు టిబెటన్లు.

మదనపల్లె అంటేనే చలి ప్రదేశం. ఎక్కడా లేని విధంగా ఇక్కడ చలి ప్రభావం తీవ్రంగా ఉంది. మదనపల్లెను ఆంధ్రా ఊటీ అంటారు. శీతాకాలం ప్రారంభంలోనే చలి ప్రభావం నుంచి తప్పించుకునేందుకు ప్రజలు ఉన్ని వస్త్రాలను ఆశ్రయిస్తున్నారు. మదనపల్లెలోని బేబీవెల్‌కమ్‌హోమ్ వద్ద ఏర్పాటు చేసిన వస్త్రాల దుకాణాలు కళకళలాడుతున్నాయి. స్వెటర్లు కొనుగోలు చేయాలంటే ప్రజలు టిబెటన్ల దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. వివిధ రకాల డిజైన్లతో స్వెటర్లు, టోపీలు, చేతి తొడుగులు, శాలువాలు, రెయిన్ కోట్‌లు, మంకీ క్యాప్‌లు, బెడ్‌షీట్లు అమ్మకాలకు పెట్టారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ డిజైన్లలో అమ్మకాలు జోరందుకున్నాయి. 'చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్నాం.. మాకు తెలిసిన స్వెటర్ల తయారీ మమ్మల్ని ఈ దేశ ప్రజలందరికి పరిచయం చేసి, మాపై నమ్మకాన్ని పెంచింది. అందులో మదనపల్లె ప్రజలు 48 ఏళ్లుగా చూపుతున్న ఆత్మీయతను ఎప్పటికి మరచిపోలేం' అంటూ తమ అనుబంధాన్ని టిబెటన్లు వివరిస్తున్నారు.

ఇదీ వారి దినచర్య

ఈసారి ఛత్‌పూర్, కోయంబత్తూరు, మైసూర్, హైదరాబాదు ప్రాంతాల నుంచి 20 కుటుంబాల వారు ఉన్ని దుస్తుల వ్యాపారం కోసం మదనపల్లెకు వచ్చారు. అందులో 16 మంది టిబెటన్లు కాగా, నలుగురు మన దేశస్తులు (వారి సహాయకులుగా) ఉన్నారు. వారంతా మదనపల్లె పట్టణంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఉదయం 6 గంటలకు లేవడం, టిఫిన్, మధ్యాహ్నం భోజనం తయారు చేసుకోవడం వీరి దినచర్య. టిఫిన్ గది వద్దనే చేసుకుని ఉదయం 9 గంటల కంతా షాపుల వద్దకు చేరుకుంటారు. రాత్రి 10 గంటల వరకు వ్యాపారం ముగించుకుని గదికి చేరుకుంటారు. వీరి వస్త్రధారణ అంతా ఒకే విధంగా ఉంటుంది. వీరు దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడి ప్రజలతో మమేకమైపోతారు. వచ్చీ రాని భాషతో మాట్లాడుతూ వ్యాపారం చేస్తారు. ఇలా పలు పట్టణాలు తిరుగుతూ తెలుగు, ఇంగ్లీషు, తమిళం, కన్నడ, మలయాళం భాషలను నేర్చుకున్నారు.

అన్ని రకాల ఉన్ని దుస్తులు లభ్యం

టిబెటన్ల దుకాణల్లో చిన్నారులు, పెద్దలకు సంబంధించిన అన్ని రకాల ఉన్ని దుస్తులు టు ఇన్ వన్ రెయిన్ కోట్లు (రెగ్జిన్లు), బెడ్‌షీట్లు (డబుల్) నాణ్యమైనవి లభ్యమవుతున్నాయి.

ధరలు

స్వెటర్లు	: రూ. 600 నుంచి రూ.1500
రెయిన్ కోట్లు	: రూ.1000 నుంచి రూ.1500
శాలువాలు	: రూ.400 నుంచి రూ.600
మంకీ క్యాప్‌లు	: రూ.80 నుంచి రూ.150
మఫ్లర్	: రూ.50 నుంచి రూ. 200
బెడ్‌షీట్లు (రగ్గులు)	: సింగిల్ రూ.600
గ్లౌజులు	: రూ.100 నుంచి రూ.200

నాణ్యమైన దుస్తులే విక్రయం



నాణ్యమైన ఉన్ని దుస్తులే విక్రయిస్తాం. ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంటాయి. ఏటా నవంబర్ మొదటి వారం నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు వ్యాపారం చేస్తాం. మా పట్ల కస్టమర్లు మొదటి నుంచి ఆదరణ చూపిస్తున్నారు.

– బినోద్, ఛత్‌పూర్, టిబెటన్

48ఏళ్లుగా...



48 ఏళ్ల కిందట ఉన్ని వస్త్రాలు విక్రయించడానికి మదనపల్లెకు వచ్చాం. ఈ ప్రాంతం చలి ప్రదేశం కావడంతో ఏటా ఇక్కడికి వస్తున్నాం. మా వ్యాపారానికి తోడ్పాటును అందిస్తున్నారు. అందుకే మదనపల్లె అంటే మాకు చాలా ఇష్టం.

– అమోల్, టిబెటన్.

కక్షతో వీపుపై కత్తితో దాడి

శరీరంలో లోతుగా దిగిన కత్తి



బి.కొత్తకోట : కక్షలను మనసులో ఉంచుకొన్న యువకుడు ఓ వ్యక్తి వీపుపై కత్తి దూశాడు. కత్తి లోతుగా దిగడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని తిరుపతి తరలించారు. గురువారం సాయంత్రం బి.కొత్తకోట మండలంలో జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలానికి చెందిన యానాది వీరాస్వామి (45) కుటుంబ కలహాలతో మండలంలోని గొల్లపల్లెకు వచ్చాడు. ఇక్కడ ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఓ ఇంటి వద్ద సిమెంటు కలిపే పనులు చేసుకుంటున్నాడు. ఇంతలో స్థానికుడైన భగవాన్ (19) అక్కడికి వచ్చి తన వెంట రావాలని వీరాస్వామిని కోరాడు. అందుకు తిరస్కరించి పనిలో నిమగ్నమయ్యాడు. పనులు చేసుకుంటూ వంగినప్పుడు భగవాన్ వెంట తెచ్చుకున్న కూరగాయలు తరిగే కత్తితో వీపుపై పొడిచాడు. కత్తి శరీరం లోపలికి వెళ్లింది. తీవ్ర రక్తస్రావం కావడంతో 108 అంబులెన్స్ ద్వారా మదనపల్లికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో తిరుపతికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. వీరాస్వామి కొన్ని రోజుల క్రితం భగవాన్‌ను తిట్టడం వల్లే కత్తితో పొడిచినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఘటనకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

సర్కారు భూమితో వ్యాపారం

- ఫ్రీహోల్డ్ భూమి అంటూ విక్రయిస్తున్న అధికార పార్టీ నాయకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

టాస్క్‌ఫోర్స్ : సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పొలం సర్వే నంబర్ 290లో 3.73 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదైంది. అయితే కొత్త ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచి ఆ భూమిలో అధికార పార్టీ నాయకులు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. రెవెన్యూ నిబంధనల్లో గ్రామ అవసరాలకు కొంత భూమిని కేటాయించడం మొదటి నుంచి అవలంబిస్తున్న ప్రక్రియ. జాతీయ రహదారి పక్కన ఉన్న కోట్లు విలువజేసే ఈ భూమిని అధికార పార్టీ నాయకులు విక్రయిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన జరుగుతున్న ఈ తంతును రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఫ్రీహోల్డ్ భూమి అంటూ ఈ భూమి తమదే అంటూ లక్షల్లో విక్రయిస్తూ పెద్ద మొత్తంలో ఆదాయాన్ని గడిస్తున్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా దేవపట్ల గ్రామంలోని పొలం సర్వే నంబర్ 290 గురించి సమాచారం అందిందని రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్టు



చెక్కుబౌన్సు కేసులో అరెస్టు అయిన పోలు మోహన్

పెనగలూరు : చెక్కు బౌన్స్ కేసులో ఒంగోలు జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన పోలు మోహన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. పెనగలూరు పంచాయతీ, సాతుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలు మోహన్‌కు రూ. 10 లక్షలు అప్పుగా ఇచ్చాడు. మోహన్ తీసుకున్న అప్పునకు చెక్కు అందజేశాడు. ఆ చెక్కును కోర్టులో వేయగా 2023లో బౌన్సు అయింది. అప్పటి జడ్జి రూ. 10 లక్షలు నగదుతోపాటు ఏడాది జైలు శిక్ష కూడా విధించారు. మోహన్ అప్పటి నుంచి కనిపించకుండా బెంగళూరుకు వెళ్లి అక్కడ వ్యాపారం చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరులో ఉన్న మోహన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

వరకట్నం కేసు నమోదు

ములకలచెరువు : అధిక కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న వారిపై ములకలచెరువు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. స్థానిక మండల కేంద్రం పీటీఎం రోడ్డుకు చెందిన ఎస్. షబ్రీన్‌కు సత్యసాయి జిల్లా ధర్మవరం కేతిరెడ్డి కాలనీలో కాపురం ఉంటున్న ఎస్. రఫీతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె సంతానం. వివాహం జరిగిన రోజు నుంచి అధిక కట్నం కోసం మానసికంగా వేధిస్తున్నారని, తనకు తెలియకుండా తన భర్తకు రెండో వివాహం సైతం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు భర్త రఫీ, అతని అక్క తాజీబి, బావ బావనాజీలపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

అయ్యప్ప భక్తుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొని అయ్యప్ప భక్తుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం హరిజనవాడకు చెందిన శివ(42) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో కాశీరావుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని పూలవాండ్లపల్లె వద్ద ఉన్న కంకర ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పూజారిపై గ్రామస్తుల ఫిర్యాదు

వీరబల్లి : దిగువరాచపల్లి పంచాయతీ రాచపల్లి దగ్గర వెలసిన ఆరిమాంబిక అమ్మవారి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న ప్రసాద్‌పై గురువారం గ్రామస్తులు దేవదాయశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. అతన్ని వెంటనే తొలగించాలని కోరారు.

బాలల చేతిలోనే దేశ భవితవ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. రమాదేవి

సంబేపల్లె / రాయచోటి టౌన్ : నేటి తరం పిల్లలే రేపటి తరానికి పునాదులని వారి మీదే దేశ భవితవ్యం ఆధారపడి ఉందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. రమాదేవి అన్నారు. గురువారం సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి తరం పిల్లలు ఆరోగ్యంగా, ఆనందకరమైన వాతావరణంలో ఎదగాలని కోరుకున్న ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. బాలల కోసం ప్రత్యేక చట్టాలను తయారు చేసుకున్నామని వాటిని గురించి విపులంగా తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే 1098కు ఫోన్ చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, అదనపు వైద్యాధికారి డాక్టర్ దేవశిరోమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. వినోద్ కుమార్, గుడ్ నైబర్స్ ఎన్‌జీఓ నాగేశ్వరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రంగరాజు, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ప్రభావతి, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో మాదిగ జాతికి నూతన వెలుగులు

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

మదనపల్లె : మాదిగ జాతి ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్ష, మూడు దశాబ్దాల పోరాటం...వచ్చే కొత్త సంవత్సరంలో నెరవేరనుందని, నూతన సంవత్సరంలో మాదిగ జాతికి నూతన వెలుగులు రానున్నాయని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వారంలోపు కమిషన్ వేయనున్నట్లు తెలిపారన్నారు. నెలరోజుల్లోపు నివేదిక వచ్చే అవకాశాలు ఉన్నందున, కొత్త ఏడాదిలో మాదిగల కల సాకారమవుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధన కోసం జరిగిన పోరాటంలో ఎట్టకేలకు మూడు దశాబ్దాల తర్వాత జాతి గొప్ప విజయాన్ని సాధించిందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబుమాదిగ, ఎంఈఎఫ్ జాతీయ కార్యదర్శి ఓ.వి.రమణ, గంపలశ్రీను, వాసు, రవి, మనోహర్, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం



బహుమతులు పొందిన చిన్నారులతో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం కడప నగర పరిధిలోని అక్కాయపల్లె బాలసదన్‌లో సాక్షి మీడియా ఆధ్వర్యంలో జేబీబీఎస్ ది ప్రిజెర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అశోక్ సహకారంతో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలలు చదువుకున్నప్పుడు స్వేచ్ఛగా ఎదుగుతారన్నారు. కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు, గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా ఆలకించాలని, బాధ్యతగా మెలగడం, క్రమశిక్షణతో నడుచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కొంతమంది చిన్నారులు మొబైల్ ఫోన్లకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఆధునిక సాంకేతికతను మంచి మార్గంలో వినియోగిస్తే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. బాలలు ప్రతిరోజు పుస్తకాలు చదవడం, పేపరు చదవడం అలవాటు చేసుకుని తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు బాలల సంక్షేమ కమిటీ కృషి చేస్తోందన్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ, మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు చొరవ చూపడం అభినందనీయమన్నారు. డీసీపీఓ సుభాష్ యాదవ్ మాట్లాడుతూ బాల్యంలో కష్టపడితే జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సేవా లక్ష్యంగా తమ సంస్థ అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతోందన్నారు. తమ సంస్థ ద్వారా బాల్య వివాహాల అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ శారద, సిబ్బంది గీత, సునీతరాజు, గోవింద్, సునీత, కృష్ణ ప్రతిరూప్, ప్రసన్న, విజయ పాల్గొన్నారు.

చాచా నెహ్రూను స్ఫూర్తిగా తీసుకోవాలి

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రధానమంత్రిగా క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ చిన్న పిల్లల కోసం తన సమయాన్ని వెచ్చించిన నెహ్రూ చరిత్రలో చాచాగా నిలిచిపోయారు.

- అమూల్య, 4వ తరగతి

మహనీయులే ఆదర్శంగా..

దేశానికి సేవలు అందించిన మహనీయులను ఆదర్శంగా తీసుకుంటాను. ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని వారి పర్యవేక్షణలో ముందుకు సాగుతాను. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే నా ధ్యేయం.

- కల్పన, 4వ తరగతి

దేశం గర్వించేలా ఎదుగుతా

నేను కష్టపడి చదివి దేశం గర్వించే స్థాయికి ఎదుగుతాను. ఇందుకు ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని నిర్ణయించాను. భవిష్యత్తులో పది మందికి సేవ చేయడమే లక్ష్యం.

- రాగవి, 4వ తరగతి

చాచా నెహ్రూ సేవలు స్ఫూర్తిదాయకం

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన హయాంలో దేశ సమగ్రాభివృద్ధికి బాటలు వేశారు. బ్రిటీషు పాలనలో విధ్వంసమైన దేశాన్ని గాడిలో పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది.

- సంగీత, 5వ తరగతి

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులు, సీపీఎం శ్రేణులు

రాయచోటి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి పోత గాళ్ల శ్రీనివాసులు విమర్శించారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం సీపీఎం శ్రేణులు పురవీధులలో పెద్ద ఎత్తున బైకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు ముదివేడు రిజర్వాయరు నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించలేదన్నారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజులు, హరిశర్మ, రామచంద్ర, మాధవ, భాస్కర, బసిరెడ్డి, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల సంఘం నేతలు రాజేష్, ముక్రమ్ బాషా, ప్రభాకరరెడ్డి, మోహన్ రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్రకు అవస్థలే!



ముళ్ల చెట్ల నడుమ పాడెను మోసుకెళుతున్న బంధువులు

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ బీదవాండ్లపల్లి ఎస్సీ కాలనీలో ఎవరైన చనిపోతే వారి అంత్యక్రియలు చేసేందుకు ఆ గ్రామ ప్రజలు అష్టకష్టాలు పడాల్సిందే. గత 20 ఏళ్లుగా ముళ్లకంపలు, గులకరాళ్లు తొక్కుకుంటూ ఒక మనిషి నడిచే కాలిబాటలో పాడెను ఎత్తుకొని నలుగురు మనుషులు నడవలేక పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావని ఆ ఊరి ప్రజలు రోధిస్తున్నారు. సుమారు 200 కుటుంబాలు ఉన్న ఆ ఊరికి శ్మశానం లేక 20 ఏళ్లుగా ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే వంకలోకి దారి లేకున్నా అష్టకష్టాలు పడి అంత్యక్రియలు చేసుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకొని మా ఊరికి శ్మశానం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.